సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం | 18 | జూలై | 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల (సోమశిల): సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 25.294 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయానికి 699 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,110
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,488
3 శాతం జీఎస్టీతో..	రూ.5,653
నవర (8 గ్రా)	రూ.45,224

గరిష్టం/కనిష్టం
36.5 /29.7

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 66 శాతం ఉంది. మంగళవారం జిల్లావ్యాప్తంగా పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

3వ యూనిట్‌లో విద్యుదుత్పత్తికి బ్రేక్



ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో రెండు యూనిట్ల నుంచి మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతున్నట్లు ప్రాజెక్ట్ ఇంజినీర్లు సోమవారం తెలిపారు. 1వ యూనిట్‌లో 380 మెగావాట్లు, 2వ యూనిట్‌లో 380 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. సాంకేతిక కారణాల వల్ల 3వ యూనిట్‌లో ఉత్పత్తిని నిలిపివేశారు.

699 పొగాకు బేళ్ల కొనుగోలు



ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం తిక్కవరం క్లస్టర్‌కు చెందిన రైతుల నుంచి 699 పొగాకు బేళ్లు కొనుగోలు చేశామని, వాటి విలువ రూ.2 కోట్లపైగా ఉందని డీసీపల్లి వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. మొత్తం 722 బేళ్లను రైతులు వేలం కేంద్రానికి తీసుకురాగా 27 బేళ్లు తిరస్కరించామన్నారు. కిలో పొగాకుకు అత్యధిక ధర రూ.245, అత్యల్ప ధర రూ.151, సగటు ధర రూ.232 నమోదైనట్లు తెలిపారు.

జిల్లాలో చిరుజల్లులు



అనంతసాగరంలో కురుస్తున్న వర్షం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో సోమవారం పలుచోట్ల చిరుజల్లులు కురిశాయి. మధ్యాహ్నం వరకు ఎండవేడిమితో భానుడు ప్రభావం చూపగా ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై చల్లటి వాతావరణం ఏర్పడింది. అనంతరం చిరుజల్లులు మొదలయ్యాయి. జిల్లాలోని ఆత్మకూరు, ఏఎస్‌పేట, మర్రిపాడు, అనంతసాగరం, చేజర్ల, కలువాయి, సంగం, వింజమూరు, దుత్తలూరుతోపాటు నెల్లూరు నగరంలో కూడా పలుచోట్ల చిరుజల్లులు కురిశాయి. రుతుపవనాల ప్రభావంతో వర్షాలు పడుతున్నట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



సీఎం పర్యటన రూట్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎంపీ, నేతలు

వెంకటగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 21వ తేదీన వెంకటగిరిలో 'వైఎస్సార్ నేతన్న నేస్తం' ఐదో విడత నిధుల విడుదల కార్యక్రమానికి వస్తున్న నేపథ్యంలో సోమవారం వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం.గురుమూర్తి, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం పర్యటన రూట్‌మ్యాప్, బహిరంగసభ నిర్వహించే ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత పదార్థాలను కోనకు తీసుకురావొద్దు

రాపూరు: మండలంలోని పెంచలకోనకు దేవస్థానం అధికారులు, పోలీసులు నిషేధించిన పదార్థాలను తీసుకురావద్దని ఈఓ జనార్దన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవస్థాన పరిసరాల్లో మద్యం, ధూమపానం, మాంసం, గుట్కా, పాన్‌పరాగ్, మత్తు పదార్థాలను నిషేధించారని, వీటిని భక్తులు తీసుకురావద్దని తెలిపారు. ఎవరైనా తీసుకువస్తే రూ.5 వేల జరిమానా విధించడంతోపాటు పోలీసు కేసు నమోదు చేస్తామని తెలిపారు.

టీడీపీలో పాదయాత్ర చిచ్చు





జిల్లాలో నారా లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్ర టీడీపీలో చిచ్చురేపింది. ఇప్పటికే పార్టీ పరిస్థితి దిగజారుతున్న క్రమంలో పాదయాత్ర జోష్ నింపుతుందని ఆశించిన ఆ పార్టీ శ్రేణులకు నిరుత్సాహమే మిగిలింది. పాదయాత్రలో వలస నేతలకు రెడ్‌కార్పెట్ వేసిన చినబాబు కష్టకాలంలో పార్టీ వెన్నంటి ఉండి జెండా మోసిన సీనియర్ నేతలు అవమానపడేలా చేయడంతో వారు అంటీముట్టనట్లు వ్యవహరించారు. పాదయాత్రకు ప్రజల్లో కూడా స్పందన కరువై ఫ్లాప్‌షోగా మారింది.

- జిల్లాలో పాదయాత్రకు స్పందన కరువు
- సీనియర్ నేతలకు అవమానాలు
- అధికారపార్టీ ఎమ్మెల్యేలపై పసలేని ఆరోపణలతో చులకనైన లోకేశ్
- చివరకు ఫ్లాప్‌షోగా ముగించిన వైనం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: టీడీపీ నేత నారా లోకేశ్ యువగళం పాదయాత్ర గత నెల 13వ తేదీన జిల్లాలోని ఆత్మకూరు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో దాదాపు నెల రోజులకు పైగా చినబాబు పాదయాత్ర చేపట్టారు. నిత్యం పసలేని ఆరోపణలు, తడబడిన ఉచ్చారణ వెరసి ప్రజల్లో మరింత చులకన అయ్యాడు. ప్రజల్లో కూడా స్పందన లేకపోవడంతో కొన్ని నియోజకవర్గాల్లో ఫ్లాప్‌షోగా మారింది. ఓ వైపు టీడీపీ నేతలు సభలను విజయవంతం చేసేందుకు జన సమీకరణ కోసం కోట్లాది రూపాయలు వెదజల్లినా ఆశించిన ఫలితాలు కన్పించలేదు.

ఒకే ఫార్ములా..

ఇటీవల కాలంలో టీడీపీ నేతలు నిర్వహించే సభల్లో ఒకే ఫార్ములా పాటిస్తున్నారు. టీడీపీ సభలకు జన స్పందన లేకపోవడంతో జనం ఎక్కువగా కన్పించేందుకు వారు ఇరుకు రోడ్లపై సభలు నిర్వహిస్తున్నారు. సహజంగా సభ జరిగే ప్రాంతం వై జంక్షన్‌లో రెండు వైపులా కన్పించేలా వాహనం ఉంచి ప్రసంగాలు చేస్తారు. కానీ టీడీపీ సభలు జరిగే ప్రదేశం జంక్షన్ ఉన్న ప్రాంతాన్ని కాదని ఇరుకురోడ్లపై ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 40 అడుగుల రోడ్డులో రహదారికి ఇరువైపులా పది అడుగులు కుదించి ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. రెండువైపులా ఇరవై అడుగులు కుదించడంతో ఇరవై అడుగులు మాత్రమే ఉండేలా చేస్తున్నారు. అక్కడ వెయ్యి మంది జనం పోగైతే చాలు వేలాది మంది ఉన్నట్లుగా చూపించే ప్రయత్నాలు చేస్తున్నారు. డ్రోన్ కెమెరాతో షూట్ చేసి వేలాది మంది ఉన్నట్లు భ్రమలు కల్పించే ఫార్ములాను అమలు చేస్తున్నారు. గతంలో కందుకూరులో చంద్రబాబు సభ ఇదే రీతిలో చేపట్టడంతో అక్కడ జరిగిన తొక్కిసలాటలో 10 మందికి పైగా మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఇదే ఫార్ములా యువగళంలో కూడా అమలు చేసి సభలు నిర్వహించారు.

సీనియర్ నేతలకు అవమానాలు

లోకేశ్ పాదయాత్రలో టీడీపీ సీనియర్ నేతలకు ఘోర అవమానాలు ఎదురయ్యాయి. ఆత్మకూరులో నాలుగేళ్లపాటు పార్టీ ఇన్‌చార్జిని కూడా నియమించని దుస్థితి ఉంది. ఈ క్రమంలో ఆత్మకూరుకు వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి(వెంకటగిరి) కోసం పాకులాడాల్సి వచ్చింది. పార్టీ సీనియర్ నేతలంతా ఆత్మకూరులో యువగళం వ్యవహారాలు చూడాలని ఆనంను కోరడంతో ఆయన కొన్ని డిమాండ్లు విధించారు. పాదయాత్ర జరిగే సమయంలో టీడీపీ సీనియర్‌నేత గూటూరు కన్నబాబు కన్పించకూడదని తెగేసి చెప్పడంతో ఆనం కోసం కన్నబాబును దూరంగా పెట్టాల్సి వచ్చింది. ఆత్మకూరులో కష్టకాలంలో కూడా పార్టీని నమ్ముకుని వెన్నంటి ఉన్న కన్నబాబును ఆనం మూలాన బలి చేయాల్సి వచ్చింది. పాదయాత్ర జరిగే సమయంలో ఆయన్ను విదేశీ పర్యటన పేరుతో పంపాల్సిన పరిస్థితి వచ్చింది. అలాగే ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు లోకేశ్‌ను కలిసే అవకాశం లేకుండా చేశారు. కాగా నెల్లూరురూరల్ నియోజకవర్గంలో అదే సీన్ జరిగింది. వైఎస్సార్‌సీపీ బహిష్కృత ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోసం ఆ పార్టీ జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌ను పక్కనపెట్టారు. గత నాలుగేళ్లలో టీడీపీ నేతలను ముప్పతిప్పలు పెట్టిన కోటంరెడ్డి కోసం అబ్దుల్ అజీజ్‌ను బలి చేశారు. ద్వితీయశ్రేణి నేతలు సైతం కోటంరెడ్డి రాకతో లోలోన కుమిలిపోతున్నారు.

పసలేని ఆరోపణలు

జిల్లాలో లోకేశ్ పాదయాత్రలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలపై చేసిన పసలేని అడ్డగోలు ఆరోపణలు ఆయన్ని నవ్వులపాలు చేశాయి. అవినీతి, అక్రమాలకు పాల్పడి వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ అయిన ఆ ముగ్గురు ఎమ్మెల్యేలను పక్కన పెట్టుకుని అవినీతి జరిగిందని చెప్పడంపై అందరినీ ఆశ్చర్యపరిచింది. లోకేశ్ పసలేని ఆరోపణలపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు సవాల్ విసిరినా టీడీపీ నేతలు మారుమాట్లాడక పోవడం గమనార్హం.

ఒక్కొక్కరికీ ఒక్కో చేదు అనుభవం

- నెల్లూరు సిటీ నియోజకవర్గంలో కూడా మాజీ మంత్రి నారాయణ కోసం కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి ఉద్వాసన పలికారు. గత నాలుగేళ్లుగా టీడీపీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న కోటంరెడ్డిని కాదని మాజీ మంత్రికి బాధ్యతలు అప్పగించడంతో విమర్శలు వెల్లువెత్తాయి. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కూడా ఈ దఫా నేను ఎమ్మెల్యే అభ్యర్థినని కోటంరెడ్డి బహిరంగంగా ప్రకటించుకోగా ఆ కలను చినబాబు కలగానే మిగిల్చాడు.
- కోవూరు నియోజకవర్గంలో సీనియర్ నేతలను సైతం టీడీపీ పెద్దలు కరివేపాకులా వాడుకుంటున్నారు. దశాబ్దాల కాలంగా ఆ పార్టీని నమ్ముకున్న పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డికి ప్రతి దఫా సీటు ఇస్తామంటూ ఆశపెడుతూ అన్యాయం చేస్తున్నారు. యువగళంలో కూడా పెళ్లకూరుకు సరైన ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో ఆయన గుర్రుగా ఉన్నారు.
- కావలి నియోజకవర్గంలో సీనియర్ నేతలకు చుక్కలు చూపించారు. బీద రవిచంద్ర మాలేపాటి సుబ్బానాయుడుని తెరపైకి తెచ్చి చేతిచమురు వదిలింపజేయగా, ప్రస్తుతం దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని తెరపైకి తెచ్చారు. అనంతరం అందరికీ మస్కాకొట్టి బీద రవిచంద్ర యువగళంలో తన సతీమణిని రంగంలోకి దింపడంతో టికెట్ ఆశించే నేతలకు దిమ్మదిరిగి మైండ్‌బ్లాక్ అయిందని అందరూ చర్చించుకున్నారు.
- ఉదయగిరిలో టికెట్ నీదేనంటూ పార్టీకి ఫండ్ తీసుకుని ఎన్‌ఆర్‌ఐ కాకర్ల సురేష్‌ను చినబాబు ఎంకరేజ్ చేశారు. దీంతో టికెట్ ఆశించిన కాకర్ల సేవా కార్యక్రమాల పేరుతో ఉదయగిరిలో మకాం వేశారు. తీరా యువగళంలో కాకర్లను దూరం పెట్టారు. పాదయాత్రలో ఆయన నీడ కూడా పడకుండా పంపించేశారు. అలాగే పార్టీలో సీనియర్‌నేతగా ఉన్న కంభం విజయరామిరెడ్డికి అవమానం జరిగింది. కొండాపురంలో జరిగిన సభలో కంభంకు మైకు ఇవ్వకుండా దింపేశారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, దగుమాటి వెంకటకృష్ణారెడ్డిలకు మైకు ఇచ్చి మాట్లాడించిన చినబాబు కంభం విజయరామిరెడ్డికి మాట్లాడే అవకాశం కూడా ఇవ్వకపోవడం గమనార్హం.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న సెట్నల్, డీఎస్‌ఏ ఇన్‌చార్జి సీఈఓ వి.నాగరాజకుమారి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తామని సెట్నల్, డీఎస్‌ఏ ఇన్‌చార్జి సీఈఓ వి.నాగరాజకుమారి తెలిపారు. స్థానిక ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సీఈఓగా అదనపు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తాను అదనపు బాధ్యతలు చేపట్టానన్నారు. 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీల్లో గ్రామీణ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్‌లలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులకు తర్ఫీదు ఇవ్వాలని సూచించారు.

స్పోర్ట్స్ విలేజ్ త్వరలో ప్రారంభం

నెల్లూరు రూరల్ పరిధిలోని మొగళ్లపాళెంలో 150 ఎకరాల్లో నిర్మిస్తున్న జాతీయస్థాయి స్పోర్ట్స్ విలేజ్‌ను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. తొలి విడతలో రూ.8 కోట్ల వ్యయంతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు పూర్తయ్యాయని, విద్యుత్ పనులు పూర్తయిన వెంటనే స్టేడియంను క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఈ స్టేడియంలో తొలి విడతగా బాస్కెట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులను సిద్ధం చేశామన్నారు. రెండో దశలో రూ.7 కోట్ల వ్యయంతో సింథటిక్ రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులను ప్రారంభిస్తామన్నారు. క్రీడాకారులు, కోచ్‌లు, ఆయా అసోసియేషన్ల సమన్వయంతో జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో డీఎస్‌ఏ చీఫ్ కోచ్ ఆర్కే యతిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

బడి ఈడు పిల్లలు బయట ఉండకూడదు

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): బడి ఈడు పిల్లలు బడి బయట ఉండకూడదని, అందరూ పాఠశాలలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో జరుగుతున్న మనబడి నాడు–నేడు అభివృద్ధి పనుల పురోగతి, జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ, ఐఎఫ్‌పీ డిజిటల్ బోర్డ్స్ ఏర్పాటు, జగనన్న గోరుముద్ద కార్యక్రమం అమలు తదితర అంశాలపై సమీక్షించి పలు ఆదేశాలిచ్చారు. క్షేత్రస్థాయిలో విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్స్, వలంటీర్లు బాధ్యత వహించి బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలలను, జూనియర్ కళాశాలలను భాగస్వాములను చేసి మిషన్ మోడ్‌లో నూటికి నూరు శాతం ఈ కార్యక్రమం అమలు చేయాలన్నారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పెండింగ్‌లో ఉన్న రెండో విడత నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేసేలా దృష్టి సారించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జూనియర్ కళాశాలలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఒకేషనల్ అధికారిని ఆదేశించారు. ఈ నెలాఖరు నాటికి వంద శాతం జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ జరగాలని తెలిపారు. ఐఎఫ్‌పీ డిజిటల్ బోర్డుల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓలను ఆదేశించారు. అన్ని పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద కార్యక్రమం పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. మున్సిపాలిటీల్లోనూ ఈ కార్యక్రమం పటిష్టంగా అమలు చేసేలా మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈఓ గంగాభవాని, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఎస్‌ఈలు రంగవరప్రసాద్, అశోక్‌కుమార్, ఐటీడీఏ పీఓ మందా రాణి, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, జిల్లా ఒకేషనల్ అధికారి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

సత్ఫలితాలిస్తున్న 'మొబైల్ హంట్'

- 270 మొబైల్స్ రికవరీ
- బాధితులకు అందజేసిన ఎస్పీ



రికవరీ చేసిన మొబైల్ ఫోన్‌ను బాధితునికి అందజేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): 'మొబైల్ హంట్' సత్ఫలితాలిస్తోందని, ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ.1.61 కోట్ల విలువ చేసే 664 సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశామని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. వివిధ కారణాలతో పోగొట్టుకున్న/చోరీకి గురైన రూ.65 లక్షలు విలువ చేసే 270 మొబైల్స్‌ను పోలీసు అధికారులు ఇటీవల రికవరీ చేశారు. సోమవారం ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆ ఫోన్లను ఎస్పీ స్వయంగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. చోరీకి గురైన/పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి బాధితులకు అందించాలన్న సంకల్పంతో మొబైల్ హంట్ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. పోలీస్‌స్టేషన్లకు వెళ్లకుండా, ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకుండా కేవలం 9154305600 నంబర్‌కు వాట్సప్ మెసేజ్ చేస్తే చోరీకి గురైన/పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సైబర్ క్రైమ్ టెక్నికల్ విభాగం ద్వారా అతి తక్కువ కాలంలోనే గుర్తించి రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రూ 1.61 కోట్ల విలువ చేసే మొబైల్స్ బాధితులకు అందించామని, మిగిలిన ఫోన్లను త్వరలోనే రికవరీ చేస్తామని తెలిపారు. 'మొబైల్ హంట్' సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ఎవరైనా తప్పుడు పద్ధతిలో వినియోగిస్తే చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. మొబైల్ హంట్‌తోపాటు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ పోర్టల్‌లో సైతం ఫిర్యాదు చేస్తే చోరీకి గురైన/పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేస్తామని తెలిపారు. సెల్‌ఫోన్లను గుర్తించి తమకు అప్పగించిన ఎస్పీ, సైబర్ క్రైమ్ పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ డి.హిమవతి, సైబర్ క్రైమ్ ఎస్సై సురేష్, ఆర్‌ఎస్‌ఐ సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశుపోషణకు భరోసా

వ్యవసాయానికి, రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పశుపోషణపై కూడా దృష్టి సారించి పశుపోషకులకు అండగా నిలుస్తోంది. ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వం ప్రారంభించిన అగ్రిల్యాబ్‌లలో మరో విభాగాన్ని ఏర్పాటు చేసి పశువులకు సంక్రమించే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వినియోగించాల్సిన మందులు తదితర అంశాలపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. తద్వారా పశుపోషకులు తమ పశుసంపదను పరిరక్షించుకునే అవకాశం కలుగుతోంది.

- ప్రతి నియోజకవర్గంలో ప్రయోగశాల
- పశువులకు సోకే వ్యాధులపై నిర్ధారణ పరీక్షలు
- తగిన మందులను సూచించి పశుసంపద వృద్ధికి కృషి



ఆత్మకూరులోని ప్రయోగశాల

గత నెలలో ల్యాబ్‌ల వారీగా పరీక్షల వివరాలు

ఆత్మకూరు	-	204
ఉదయగిరి	-	201
కందుకూరు	-	201
సర్వేపల్లి		207
కావలి		198
కోవూరు	-	198
నెల్లూరు టౌన్	-	187
నెల్లూరు రూరల్	-	200

ఆత్మకూరు: రైతులకు వ్యవసాయంతోపాటు పాడిపరిశ్రమ జీవనాధారం. కాలక్రమంలో పశుసంపద పెరిగినట్లుగానే వాటికి సంక్రమించే వ్యాధుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చినట్లుగానే పశుపోషణ, పశువైద్యానికి పెద్దపీట వేస్తోంది. అందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో దాదాపు రూ.57 లక్షల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ఈ ప్రయోగశాలలో వ్యవసాయ రంగంలో సంక్రమించే తెగుళ్లపై ఓ వైపు ప్రయోగాలు జరుగుతుండగా, మరో వైపు పశువులకు సంక్రమించే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉపయోగించాల్సిన మందుల పై ప్రయోగాలు చేస్తున్నారు. పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పర్యవేక్షణలో ఈ ప్రయోగశాలలో ల్యాబ్ టెక్నీషియన్లు పనిచేస్తుంటారు. నియోజకవర్గంలోని అన్ని పశువైద్యశాలల నుంచి అందే వ్యాధుల నమూనాలపై ప్రయోగాలు చేసి అనాలసిస్ రిపోర్టులు ఏడీకి అందజేస్తుంటారు. సకాలంలో వ్యాధులను గుర్తించి మందులు అందజేస్తుండడంతో పశువుల మరణాలు తగ్గి పశుసంపద వృద్ధి చెందుతోంది.

నెలకు లక్ష్యం 175 పరీక్షలు

జిల్లాలో మొత్తం 8 నియోజకవర్గాల్లో 8 అగ్రి ల్యాబ్‌లు ఉన్నాయి. వీటిలో పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు తదితరాలకు సంక్రమించే వ్యాధులపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం లక్ష్యం నెలకు 175 చొప్పున ఒక్కో ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. అయితే నెల్లూరు జిల్లాలోని 8 ల్యాబ్‌లు నిర్దేశించిన లక్ష్యానికి మించి పరీక్షలు గత నెలలో నిర్వహించినట్లు నివేదికల ద్వారా తెలుస్తోంది.

ప్రయోగాలు ఇలా..

పశువుల మూత్రం, పేడ, చర్మ సమస్యలకు సంబంధించిన నమూనాలను ఈ ప్రయోగశాలలో పరీక్షించి వ్యాధి లక్షణాలు గుర్తిస్తారు. వీటితోపాటు పశువులకు పలు రకాల టీకాలు వేశాక వాటి పనితీరు, పశువుల్లో ఏదైనా వైపరీత్యాలు సంభవిస్తే వాటిని పరిశీలించడం లాంటివి ఈ ప్రయోగశాలల్లో జరుగుతుంటాయి. అలాగే పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను కూడా గుర్తిస్తారు. ముఖ్యంగా 'బ్రూసెల్' వ్యాధిని గుర్తించడం (పునరుత్పత్తి లేకపోవడాన్ని), యాంటీబయోటిక్ నిర్ధారణ పరీక్షలు, పాలు, రక్తనమూనాలు సేకరించి ఏ యాంటీబయోటిక్ మందు ఇస్తే పశువుకు వ్యాధి నయమవుతుందో గుర్తించడం, వ్యాధుల బారిన పడి మృతిచెందిన పశువులకు శవపరీక్షలు.. ఇలాంటివన్నీ ఈ ప్రయోగశాలలోనే నిర్వహిస్తున్నారు. గొర్రెలు, మేకలకు సోకే 'నట్టల'(పారాసైట్స్) నిర్ధారణకు, దానికి తగువైన మందులు ఇచ్చేందుకు ఇక్కడ ప్రయోగాలు జరుగుతుంటాయి. అలాగే కోళ్లకు సంక్రమించే వ్యాధులను సైతం ఈ ప్రయోగశాలలో గుర్తిస్తారు. ప్రతి ఏటా పరీక్షలు, ప్రయోగాల కోసం ఉపయోగించే రసాయనిక ద్రావణాలు, ఇతర పరికరాల కోసం సుమారు రూ.2 లక్షలు ఒక్కొక్క ప్రయోగశాలకు ప్రభుత్వం మంజూరు చేస్తుంది.

జాతీయస్థాయిలో ప్రశంసలు

ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన 'వెబినార్'లో పలు రాష్ట్రాల పశుసంవర్ధకశాఖ మంత్రుల చర్చల్లో ఆంధ్రప్రదేశ్‌లోని ఈ ప్రయోగశాలల ప్రస్తావన రావడం, ఇతర రాష్ట్రాల మంత్రులు, కేంద్ర మంత్రి సైతం ఈ విధానాన్ని ప్రశంసించడం జరిగింది.

జంతువుల ద్వారా మనుషులకు..

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల వద్ద కుందేళ్లు, కుక్కలు, కోళ్ల పెంపకం సర్వసాధారణం. కాగా కుందేళ్ల ద్వారా మనుషులకు చర్మవ్యాధులు సంక్రమించిన వైనాన్ని ఇటీవల ప్రయోగశాలలో గుర్తించారు. అలాగే కుందేళ్లకు వ్యాధి నివారణ మందులు ఇవ్వడంతోపాటు వాటి పెంపకందారులకు సంక్రమించిన చర్మవ్యాధి నివారణకు వాడాల్సిన మందులను పశువైద్యాధికారులు సూచించారు. ఇలా పశువుల ద్వారా మనుషులకు సంక్రమించే వ్యాధులను ఈ ప్రయోగశాలల్లో గుర్తించి నివారణ మార్గాలను సూచిస్తున్నారు.



పశువులకు సోకిన వ్యాధిని నిర్ధారించే పరికరం

రైతులకు ఎంతో ఉపయోగకరం



"గత రెండేళ్లుగా నియోజకవర్గ కేంద్రాల్లో ప్రయోగశాలలు ఏర్పాటు కావడం, సకాలంలో వ్యాధులను గుర్తించి మందులు అందజేస్తుండడంతో పశువుల మరణాలు తగ్గి పశుసంపద వృద్ధి చెందుతోంది. ఈ ప్రయోగశాలలు రైతులకు ఎంతో ఉపయోగకరం. అయితే పునరుత్పత్తి లేకుండా చేసే బ్రూసెల్ వ్యాధిని 2030 నాటికి అంతం చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. దీంతో ఆ వ్యాధి నివారణకు 4 నుంచి 8 నెలల వయసు గల ఆడ దూడలకు టీకాలు వేస్తున్నాం.

– డాక్టర్ జయచంద్ర, పశుసంవర్ధకశాఖ ఏడీ, ఆత్మకూరు

ఆయిల్‌పామ్ సాగుకు ఊతం

- ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- మూడేళ్లపాటు సబ్సిడీ అందజేత
- జిల్లాలో 750 ఎకరాల్లో సాగు


ఆయిల్‌పామ్ చెట్లు

నెల్లూరు(సెంట్రల్): రైతులు సాగు చేస్తున్న ప్రధాన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తోంది. ఉద్యాన పంటల్లో ప్రధానమైన అయిల్‌పామ్ సాగుకు ప్రత్యేక రాయితీలు ఇస్తోంది. దీంతో అనేకమంది రైతులు దాని సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఆయిల్‌పామ్‌లో రెండు రకాల మొక్కలున్నాయి. అవి ఒకటి స్వదేశీ, మరొకటి ఇంపోర్టెడ్.

సబ్సిడీ ఇలా..

ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులు మొక్కలు వేసినప్పటి నుంచి నాలుగు సంవత్సరాలకు కాపునకు వస్తాయి. ఈ నేపథ్యంలో మూడు సంవత్సరాలపాటు వివిధ రూపాల్లో ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. మొదట మొక్కల కొనుగోలుకు రూ.20 వేలు, తర్వాత మొక్కల పెంపకానికి రూ.21 వేలు, ఇంకా సాగు చేతికి వచ్చే వరకు, అలాగే అంతర పంటలు వేసేందుకు మరో రూ.21 వేలను అందిస్తుంది. ఇది స్వదేశీ మొక్కలు వేసే వారికి. ఇంపోర్టెడ్ మొక్కలు సాగు చేసేవారికి సబ్సిడీ మొత్తం రూ.71 వేలుగా ఉంది.

ఆ ప్రాంతాల్లోనే ఎక్కువ

జిల్లాలో ఆయిల్‌పామ్ సుమారు 750 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో సాగు ఇంకా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం దుత్తలూరు, మనుబోలు, వింజమూరు, జలదంకి, కలిగిరి, ఇందుకూరుపేట, ఏఎస్‌పేట, ఆత్మకూరు ప్రాంతాల్లో పంట వేశారు. ఇతర ప్రాంతాల్లో కూడా సాగు చేసేలా అధికారులు ప్రోత్సహిస్తున్నారు.

ఆసక్తి ఉన్న వారు సంప్రదించాలి



జిల్లాలో ఇప్పుడిప్పుడే ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. ప్రభుత్వం పూర్తిగా సబ్సిడీపై మొక్కలను అందజేస్తుంది. పంట చేతికొచ్చే వరకు సబ్సిడీ అందుతుంది. దీంతో రైతుకు నష్టం వాటిల్లదు. ఆయిల్‌పామ్‌పై ఆసక్తి ఉన్న రైతులు సమీపంలోని ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలి. – సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

'జగనన్నకు చెబుదాం'పై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ హరినారాయణన్


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్నకు చెబుదాం'పై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల నుంచి వచ్చే అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. నెల్లూరులోని కలెక్టరేట్ కార్యాలయంలో ఉన్న తిక్కన సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా హరినారాయణన్ మాట్లాడుతూ స్వయంగా అర్జీదారుల వద్దకు వెళ్లి మాట్లాడి పరిష్కారం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిణి సుస్మిత, డీఈఓ గంగా భవాని, సర్వే ఏడీ హనుమాన్ ప్రసాద్, హౌసింగ్ పీడీ నాగరాజు, సోషల్ వెల్ఫేర్ డీడీ రమేష్, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

- కోవూరు షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని బీజేపీ సమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దామరమడుగు – పాటూరు మధ్యనున్న పల్లాపు కాలువ ఆక్రమణలకు గురైందని, మూడు కిలోమీటర్ల పొడవున్న కాలువను పూడ్చి కూరగాయలు పండించుకుంటున్నారని తెలిపారు. పంట కాలువ కింద 700 ఎకరాల శిస్తు రద్దు చేయాలని కోరారు. దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి దళిత గిరిజనులకు తక్షణమే భూ పంపిణీ చేయాలని, అక్రమంగా గ్రావెల్ తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలంటూ వినతిపత్రం సమర్పించారు.

కారు బీభత్సం

- రెండు బైక్‌లను ఢీకొని..
- ఒకరి దుర్మరణం
- ముగ్గురికి తీవ్ర గాయాలు


రవి మృతదేహం

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని కాగులపాడు అర్చి వద్ద ముంబై జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రవి (45) అనే వ్యక్తి మృతిచెందాడు. ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఎస్సై వీరప్రతాప్ కథనం మేరకు.. నెల్లూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం వైపు అతి వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రాంగ్‌రూట్‌లోకి వచ్చి సంగం నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న బైక్‌ను మొదట ఢీకొంది. దీనిపై సంగం మండలం అనసూయనగర్‌కు చెందిన భార్యాభర్తలు ఉండగా వారిద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. అలాగే కారు మరో బైక్‌ను కూడా ఢీకొనడంతో దానిపై వెనుక ఉన్న రవి అనే వ్యక్తి రోడ్డుపై పడ్డాడు. తల వెనుక భాగంలో బలమైన గాయం కావడంతోపాటు ఎడమకాలు కూడా విరిగిపోవడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే ఆ బైక్‌పై ఉన్న ఎం.హరి అనే వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో నెల్లూరుకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడు రవిది దుత్తలూరు మండలం చింతలగుంటగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో కారు ముందు దెబ్బతింది.

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షల్లో ఏడుగురు డిబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షల్లో ఏడుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు మొత్తం 994 మంది హాజరై, 88 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో సూళ్లూరుపేటలోని ఎస్‌వీఎస్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆరుగురు, విక్రమ్ డిగ్రీ కళాశాలలో ఒక విద్యార్థిని డిబార్ చేశారన్నారు.

బంగారు సరుడు దోపిడీ

చేజర్ల: మహిళ మెడలోని బంగారు సరుడు దోపిడీ చేసిన ఘటన మండలంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చల్లా రాజమ్మ అనే మహిళ వావిలేరు – నావూరు బాటలో పశువులను ఇంటికి తోలుకెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు మాస్కులు ధరించి బైక్‌పై వచ్చి ఆమెను బెదిరించి 2.5 సవర్ల బంగారు సరుడును దోచుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదుతో చేజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతులు నెల్లూరు వాసులు

గూడూరు రూరల్: గూడూరు రూరల్ పరిధిలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఇద్దరు యువకులు నెల్లూరుకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కుటుంబసభ్యులకు సమాచారం అందించగా వారు సోమవారం ఉదయం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి చేరుకున్నారు. నెల్లూరు ఇరగాలమ్మగుడి ప్రాంతంలోని సాయినగర్‌కు చెందిన సయ్యద్ సమీర్ (17), గిడ్డంగి వీధికి చెందిన షేక్ సోహైల్ అక్రమ్ (20) నెల్లూరులో బంగారు పని చేస్తుంటారు. ఆదివారం రాత్రి మాల్‌కు వెళ్తున్నామని చెప్పి బయటకు వచ్చినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గూడూరు ప్రాంతం వైపు ఎందుకు వచ్చారో తెలియదన్నారు. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందజేశారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రీన్‌టెక్ ఉద్యోగి అనుమానాస్పద మృతి

నాయుడుపేటటౌన్: మండల పరిధిలోని మేనకూరు సెజ్ పరిధి, కోనేటిరాజుపాళెం గ్రామ సమీపంలోని గ్రీన్‌టెక్ ఉద్యోగి కిన్నెర నాగేంద్రబాబు (33) ఆ పరిశ్రమ వద్ద అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండడాన్ని సోమవారం ఉద్యోగులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల కథనం మేరకు.. వెంకటగిరి పాతమంబపురం ప్రాంతానికి చెందిన నాగేంద్రబాబు గ్రీన్‌టెక్ పరిశ్రమలో ఓ ప్లాంట్ ఇన్‌చార్జిగా 12 ఏళ్లగా పనిచేస్తున్నాడు. అతడికి భార్య, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. ఆదివారం రాత్రి పరిశ్రమ వద్దకు వచ్చి తన మోటార్ బైక్ బయట పెట్టి లోపలికి వెళ్లాడు. సోమవారం ఉదయం పరిశ్రమ బస్సులు పార్కింగ్ చేసే స్థలంలో నాగేంద్రబాబు మృతిచెంది ఉన్నాడు. మద్యం మత్తులో వచ్చి పార్కింగ్ చేసే స్థలంలో నిద్రపోయి ఉండడంతో ఏదైనా బస్సు కిందపడి మృతిచెందాడా?, ఇతర కారణం ఉందా? అని విచారిస్తున్నట్లు సీఐ నరసింహారావు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు వెల్లడించారు. కాగా నాగేంద్రబాబును హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరిస్తున్నారని బాధిత తండ్రి కిన్నెర పెంచలయ్య పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎవరో గిట్టని వారు హత్య చేశారని ఆరోపించారు.

గడువులోగా వినతుల పరిష్కారం


సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): స్పందనకు వచ్చే వినతులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 105 మంది విచ్చేసి తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీకి అందజేశారు. వాటిని పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. నిర్ణీత గడువులోగా చట్టపరిధిలోని సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రధానంగా ప్రేమ పేరుతో మోసం, కుటుంబ కలహాలు, భూ, ఆస్తి వివాదాలు, దళారుల మోసాలపై వినతులు అందాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వైట్ కాలర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులను మోసగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్పీ డి.హిమవతి, దిశ డీఎస్పీ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డయేరియా రోగులకు వైద్య సేవలు

- పర్యవేక్షించిన డీఎంహెచ్‌ఓ
- తాగునీరు కలుషితం కాలేదని వెల్లడి


బాధితులను పరామర్శించి వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని ఇస్కపాళెం పంచాయతీ పల్లాప్రోలు ఎస్సీ కాలనీలో డయేరియాతో బాధపడుతున్న వారితో సోమవారం డీఎంహెచ్‌ఓ ఎం.పెంచలయ్య మాట్లాడారు. గ్రామంలోని క్రైస్తవ ప్రార్థనా మందిరంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. నలుగురు బాధితులతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దాదాపు 60 మందికి పైగా డయేరియా రావడంతోపాటు అందులో ఇద్దరు ఇతర వ్యాధుల ప్రభావంతో మృతిచెందడంపై ఆరా తీస్తున్నామన్నారు. ఇప్పటికే తాగునీటిని పరీక్షించగా కలుషితం కాలేదని తేలిందన్నారు. ఇటీవల జరిగిన ఓ వేడుకలో పాల్గొన్న గ్రామస్తులు అక్కడ మిగిలిన భోజనాన్ని తీసుకుని నిల్వ ఉంచి తర్వాతి రోజు తినడంతో డయేరియా వచ్చినట్లుగా గుర్తించామన్నారు. అయితే ఆ భోజనం తినని కొంతమందికి డయేరియా ఎలా వచ్చిందనే విషయంపై ఆరా తీస్తున్నామన్నారు. క్యాంప్‌ను కొనసాగిస్తామన్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. ఆయన వెంట నెల్లూరు డివిజన్ ప్రోగ్రామ్ అధికారి దయాకర్, వైద్యులు ప్రమోద్, అహ్మద్ బాబు, సురేంద్ర, వినీతారెడ్డి, వినయ్ కుమార్, ప్రత్యూష, తహసీల్దార్ సుధీర్, కార్యదర్శి కావేరి ఉన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాలపై ప్రజలకు అవగాహన

- కలెక్టర్ హరినారాయణన్


వాహనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ నూతన, పునరుద్ధరణ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (నెడ్‌కాప్) ఆధ్వర్యంలో నెల్లూరులోని కలెక్టరేట్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పులను దృష్టిలో పెట్టుకుని పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. నెడ్‌కాప్ ఆధ్వర్యంలో సులభతర వాయిదా పద్ధతుల్లో ప్రభుత్వ ఉద్యోగులకు వాహనాలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఆ వాహనాల వైపు మొగ్గు చూపి పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నెడ్‌కాప్ ఏపీ డైరెక్టర్ దాసరి భాస్కర్‌గౌడ్, ప్రాజెక్ట్ డైరెక్టర్ రామలింగయ్య, డీఓ దుర్గా ప్రసాద్, జీఎంలు అబ్దుల్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మూడుకు చేరిన మృతుల సంఖ్య

- ఆదివారం రాత్రి దువ్వూరు వద్ద రోడ్డు ప్రమాదం
- అక్కడికక్కడే ఇద్దరి మృతి
- చికిత్స పొందుతూ మరో యువకుడి మృత్యువాత


పవన్ కుమార్ (ఫైల్)


పవన్ కుమార్ మృతదేహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

సంగం: మండలంలోని దువ్వూరు వద్ద నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుల సంఖ్య మూడుకు చేరుకుంది. తీవ్రంగా గాయపడిన మైలు పవన్‌కుమార్ (20) అనే యువకుడు సోమవారం మృతిచెందాడు. రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో మధు, లక్ష్మీనారాయణ అనే యువకులు అక్కడికక్కడే చనిపోయిన విషయం తెలిసిందే. సోమవారం తెల్లవారుజామున పవన్ కుమార్ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలిస్తుండగా నాయుడుపేట వద్దకు వెళ్లేసరికి చనిపోయాడు. పవన్ తల్లిదండ్రులు 15 సంవత్సరాల క్రితం మృతిచెందారు. దీంతో అతను మేనమామ సంరక్షణలో పెరిగాడు. ప్రస్తుతం వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. బుచ్చికి వెళ్లొస్తానని బయలుదేరిన పవన్ చనిపోవడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. సిద్ధీపురం దళితవాడలో వలంటీర్‌గా పనిచేస్తున్న పవన్ అందరితో మంచిగా మెలిగేవాడు. అతడి మృతితో దళితవాడలో విషాదం నెలకొంది. సంగం ఎస్సై నాగార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పరామర్శ

పవన్ కుమార్ మృతి విషయం తెలుసుకున్న ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సోమవారం సిద్ధీపురానికి వచ్చారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చి ప్రభుత్వపరంగా సాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం సంగం రాళ్ల చెలికకు చెందిన కె.వెంకటేశ్వర్లు పొదలకూరు మండలంలోని మహ్మదాపురంలో కూలి పనులకు వెళ్లి గోడ కూలి మృతిచెందగా ఆ కుటుంబాన్ని సైతం ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ సంగం మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, సిద్ధీపురం, సంగం నాయకులు గుండాల బాలచంద్రారెడ్డి, కంటాబత్తిన రఘునాథరెడ్డి, కర్నాటి రవీంద్రారెడ్డి, ఎం.వాసుదేవరెడ్డి, ఎస్.మదన్‌మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్ రెడ్డి తదితరులున్నారు.

నవోదయ యాజమాన్య కమిటీ సమావేశం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని కృష్ణాపురంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయం యాజమాన్య కమిటీ సమావేశం వర్చువల్ విధానంలో కలెక్టర్, విద్యాలయ చైర్మన్ ఎం.హరినారాయణన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 – 25 విద్యా సంవత్సరానికి నవోదయలో ప్రవేశాల కోసం వచ్చే ఏడాది జనవరి 20వ తేదీన ప్రవేశపరీక్ష జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. విద్యాలయం పనితీరు, ఇక్కడి విద్యార్థుల ప్రతిభాపాటవాలను మరింత మెరుగుపరిచేలా బోధన సాగించాలన్నారు. డీఈఓ గంగా భవాని మాట్లాడుతూ సీబీఎస్‌ఈ సిలబస్‌తో నడుస్తున్న నవోదయలో అటల్ టింకరింగ్ ప్రయోగాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. కమిటీ సభ్యుల హోదాలో డీఎంహెచ్‌ఓ ఎం.పెంచలయ్య, ఈఈ మురళీకృష్ణ, బీసీ గురుకుల విద్యాలయాల కన్వీనర్ మురళీకృష్ణ, పేరెంట్స్ కమిటీ సభ్యురాలు డాక్టర్ కళ్యాణి, విద్యాలయం ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 121	బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 236
లేయర్ (లైవ్)	: 92		
బ్రాయిలర్ చికెన్	: 212	లేయర్ చికెన్	: 156

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.26
సన్నవి	: రూ.12
పండ్లు	: రూ.5